నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

రాజేంద్రనగర్: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై సలహాలు, సూచనల కోసం గురువారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపో మేనేజర్ బద్రీనారాయణ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాజేంద్రనగర్ డిపోలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. రాజేంద్రనగర్ పరిసర ప్రాంత ప్రజలు, ప్రయాణికులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయాణికులు ఫోన్: 99592 26135లో సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని డీఎం కోరారు.

నేడు దేవతా విగ్రహాల ఊరేగింపు

రాజేంద్రనగర్: బుద్వేల్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ నాగదేవత ఈదమ్మ భద్రకాళి తుంగభద్ర స్వామి దేవాలయాల్లో ప్రతిష్ఠించనున్న విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం బుద్వేల్ నుంచి దేవాలయం వరకు దేవతా విగ్రహాలను ఊరేగిస్తామన్నారు. బుద్వేల్ గ్రామస్తులు, కాలనీ, బస్తీవాసులు ఊరేగింపులో పాల్గొని దేవతామూర్తులకు స్వాగతం పలుకుతూ పూజలు, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి 2వ తేదీన రేవల్లి రాజు శర్మ ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం ఉంటుందని వారు వివరించారు.

అన్నదానం.. పుణ్యకార్యం



మణికొండ: ఆకలితో ఉన్న వారికి పట్టెడన్నాన్ని అందజేయడం పుణ్యకార్యంగా భావించాలని.. అన్నదానం చేయటం ఎంతో ఆనందంగా ఉందని మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓలం యాదగిరి అన్నారు. బుధవారం అమావాస్య సందర్భంగా అలకాపూర్ టౌన్‌షిప్‌లోని వారి కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి నెల అమావాస్య రోజు క్రమం తప్పకుండా తమ అసోసియేషన్ తరఫున అన్నదానం చేస్తున్నామన్నారు. అన్నదానంతోపాటు అనేక సేవా కార్యక్రమాల నిర్వహణలో తమ సభ్యులు ముందుంటున్నారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీలు షురూ



గోల్కొండ: కార్వాన్‌లోని మార్కండేయ స్వామి భవనంలో బుధవారం రెజ్లింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కార్వాన్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఉత్తరపల్లి కృష్ణ మాట్లాడుతూ.. జై మార్కండేయ శ్రీ మార్కండేయ స్వామి జన్మత్సోవాల్లో భాగంగా మూడేళ్లుగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రెజ్లింగ్ కోచ్ విశాంభర్, దోర్నాల ప్రసాద్, గుడిమల్కాపూర్ బీజేపీ డివిజన్ అధ్యక్షులు దేవర వంశీ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ సహ కార్యదర్శి ప్రభుపూజారి తదితరులు ఉన్నారు. విజేతలుగా నిలిచిన వారికి మార్కండేయ కేసరితో సత్కరిస్తామని ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు ఉత్తరపల్లి దయానంద్ అన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



పాల్గొన్న అధికారులు, సిబ్బంది, విద్యార్థులు

గోల్కొండ: షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 'రోడ్డు ప్రమాదాల నివారణపై' బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టోలిచౌకీలోని పశ్చిమ మండలం ఆర్టీవో జి.రవికుమార్ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఫోర్‌వీలర్ వాహనదారులు సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేశ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ నీలి రమేశ్, ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ ఎం.అపర్ణ, మహిళా సెల్ అధికారి డాక్టర్ కె.రమ్య, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ అస్తవ్యస్తం

- శివారు ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా చెత్త డంపింగ్
- పలు యార్డుల్లోనే కాల్చివేస్తున్న సిబ్బంది
- పెరుగుతున్న వాయు కాలుష్యంపై సర్వత్రా ఆందోళన
- తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించని వైనం
- సిబ్బంది.. అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



సుల్తాన్‌పల్లిలోని డంపింగ్ యార్డులో కాలిపోతున్న చెత్త

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండల పరిధిలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవుతోంది. పలు గ్రామాల్లో ఉత్పన్నం అవుతున్న చెత్తను సేకరించి.. దాన్ని సక్రమంగా డంపింగ్ చేసే విషయంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. దీనికితోడు తడి, పొడి చెత్తను వేర్వేరుగా కాకుండా కలిపి సేకరిస్తుండటం కాలుష్యానికి మరింత ఊతం ఇస్తోంది.

- కొన్ని ప్రాంతాల్లో డంపింగ్ యార్డులకు స్థలం లేనందున ఆయా గ్రామాల శివారు ప్రాంతాల్లోని గుంతల్లో చెత్త ఇతర వ్యర్థాలను పడేస్తున్నారు.
- ఈ నేపథ్యంలో గ్రామ శివారుల్లోని ప్రజానీకం దుర్గంధంతోపాటు చెత్త నుంచి వచ్చే ఈగలు, దోమలతోపాటు పలు విషకీటకాల బారిన పడుతున్నారనే ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది. ఆయా సమస్యలను నివారించాల్సిన యంత్రాంగం మొద్దు నిద్రపోతోందనే ఆరోపణలూ లేకపోలేదు.
- శంషాబాద్ మండల పరిధిలో ఉన్న 21 పంచాయతీల్లో సింహభాగం ఈ రకంగానే చెత్త సేకరణ కొనసాగుతోంది.
- ప్రధానంగా కాచారం, పెద్దషాపూర్, జూకల్, నర్కూడ, చౌదరగూడ తదితర పంచాయతీల్లో ఈ తరహా సమస్య అధికంగా ఉంది.
- పంచాయతీకి ఒకటి చొప్పున గ్రామాల్లో చెత్త డంపింగ్ యార్డులను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి ఇక్కడకు తరలించాలి.
- తడి చెత్తతో ఎరువు తయారు చేసి నర్సరీ, పల్లె ప్రకృతి వనాలకు వినియోగించాలి. మిగిలిన ఎరువును విక్రయించి పంచాయతీకి అదనపు ఆదాయ వనరుగా మార్చుకోవచ్చు. ఇవన్నీ కాగితంపై మాత్రమే రూపుదాల్చి కార్యాచరణకు నోచుకోవడంలేదు.
- ఏడాదిగా పంచాయతీలకు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండగా.. చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించడంలేదనే విమర్శలు ఉన్నాయి. సర్పంచులు పదవిలో ఉన్నప్పుడు వారిపై అధికారులు ఒత్తిడి చేసి మరీ పనులు చేయించారని, ఇప్పుడు పంచాయతీల్లో ఎలాంటి పనులు చేపట్టడం లేదని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

పర్యావరణానికి ముప్పు...

గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులు, గుంతల్లో పారబోసి ఇష్టానుసారంగా నిప్పుపెట్టి తగలబెడుతున్నారు. అందులో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలతో వెలువడే కాలుష్యంతో పర్యావరణం దెబ్బతింటున్నదని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ కాలుష్యపు గాలిని పీల్చుకోవాల్సి వస్తుంది. చెత్త సేకరణ మొదలుకొని, డంపింగ్ యార్డుల నిర్వహణ వరకు అడుగడుగునా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయా గ్రామల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- గ్రామాల్లో పర్యావరణానికి పెద్ద ముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్ వినియోగంపై ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. దీంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్నాయి. వీటిని సేకరించేందుకు పంచాయతీలకు కష్టంగా మారింది. పైగా సేకరించిన ప్లాస్టిక్‌ను తగలబెడుతూ మరో రకంగా పర్యావరణానికి హాని కల్గిస్తున్నారనే ఆందోళన నెలకొంది. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి ప్లాస్టిక్ కవర్ల వినియోగం.. విక్రయంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆస్తిపన్ను సకాలంలో చెల్లించండి

రాజేంద్రనగర్ డీసీ రవికుమార్



రాజేంద్రనగర్: జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులు తమ ఆస్తి పన్ను బకాయిలను సకాలంలో చెల్లించాలని సర్కిల్ ఉప కమిషనర్ డాక్టర్ కె.రవికుమార్ కోరారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం, అత్తాపూర్ డివిజన్లలో రూ. 50 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాలని టార్గెట్‌ను ఉన్నతాధికారులు సూచించారన్నారు. ఇప్పటి వరకు 69 శాతం వసూలు చేశామన్నారు. మరో రూ. 16 కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు. మార్చి 31వ తేదీలోపు ఈ టార్గెట్‌ను పూర్తి చేసేలా తగు ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే బిల్ కలెక్టర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించామన్నారు. రోజువారీ టార్గెట్‌ను వారికి నిర్దేశించామని ఆయన పేర్కొన్నారు. మొండి బకాయిదారుల జాబితాను తయారు చేసి వారికి షోకాజ్ నోటీసులను జారీ చేశామన్నారు. నోటీసులు అందుకొని స్పందించకపోతే ఆస్తులను జప్తు చేస్తామని డీసీ హెచ్చరించారు. పన్ను చెల్లింపుదారులు తమ వద్దకు వచ్చే బిల్ కలెక్టర్లకు ఆస్తిపన్నును చెల్లించాలని కోరారు. ఆన్‌లైన్ ద్వారా లేదా సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో కానీ చెల్లించవచ్చని ఆయన వెల్లడించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులు

రాజేంద్రనగర్: బుద్వేల్ చింతల్‌బస్తీ బస్తీ దవాఖానా ప్రాంతంలో బుధవారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరానికి పరిసర ప్రాంతాల ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. చిన జీయర్ స్వామి జిమ్స్ కాలేజీ, హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య శిబిరాన్ని అందుబాటులో ఉంచారు. పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 120 మంది రోగులు పాల్గొని వైద్య సేవలను పొందారు. వారికి వైద్య సేవలు అందించడంతో పాటు ఉచితంగా హోమియో మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... ప్రతి బుధవారం చింతల్ బస్తీలోని బస్తీ దవాఖానా వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. హోమియో వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గాంధీజీ సూత్రాలు బలమైన పునాదిని అందిస్తాయి

ఐసీఎస్ఎస్ఆర్ సభ్యురాలు ప్రొఫెసర్ షీలారాయ్

రాయదుర్గం: జర్నలిజంలో ప్రస్తుతం సంచలనాలు, తప్పుడు సమాచారం సహా అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని, గాంధీజీ సూత్రాలు గొప్ప మేలు, బలమైన పునాదిని అందిస్తాయని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సభ్యురాలు ప్రొఫెసర్ షీలారాయ్ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'మహాత్మా గాంధీ జర్నలిజం ..సమకాలీనయుగంలో దాని ఔచిత్యం' అనే అంశంపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ (ఎంసీజే), ఇండియన్ సొసైటీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల సదస్సు బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె సత్యం, అహింస, సామాజిక బాధ్యత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఎంసీజే విభాగం డీన్, హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ మాట్లాడుతూ విద్య, అభ్యాసంలో గాంధీ ఆదర్శాలను ఏకీకృతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. అనంతరం సదస్సులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 'మనూ' ఫ్యాకల్టీ, అధికారులు, ఇండియన్ సొసైటీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి హాస్టల్‌లో సీసీ కెమెరాలు ఉండాలి

మాదాపూర్ డీసీపీ వినీత్

గచ్చిబౌలి: పీజీ హాస్టళ్లలో భద్రతా ప్రమాణాలు పాటించాలని మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ నిర్వాహకులకు సూచించారు. బుధవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఐటీ కారిడార్‌లోని హాస్టళ్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ప్రతి హాస్టల్‌లో సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. హాస్టళ్లలో ఉండే వారి పూర్తి వివరాలతో పాటు ఎక్కడ పని చేస్తారో ఆ వివరాలను భద్రపర్చాలని పేర్కొన్నారు. గదులను శుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని చెప్పారు. నిబంధనలు పాటించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, డ్రగ్స్ సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. పోలీసులు హాస్టళ్లను తరచు తనిఖీలు చేస్తూ నిఘా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ ఎస్.జయరాం, ఏసీపీ సీహెచ్ శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్లు హబీబుల్లాఖాన్, సీహెచ్ వెంకన్న, కృష్ణమోహన్, హాస్టళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.



హాస్టళ్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న డీసీపీ డాక్టర్ వినీత్

మార్చిలో 'ఇందిరా' క్యాంటీన్లు ప్రారంభం

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 25వ తేదీ నాటికి 150 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించనున్నట్లు 'సెర్ప్' డైరెక్టర్ డబ్ల్యూ జాన్సన్ వెల్లడించారు. గచ్చిబౌలిలోని నిథమ్‌లో 7వ బ్యాచ్ మహిళల శిక్షణ ముగింపు కార్యక్రమంలో వారికి సర్టిఫికెట్లను అందించిన అనంతరం ఆయన ఆయన మాట్లాడుతూ ముడిసరుకులు, వంటగది నిర్వహణ బాధ్యత నిర్వహించేది మహిళలేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 300 మంది మహిళలకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 7 బ్యాచ్‌లలో కలిపి 190 మందికి శిక్షణ అందించామన్నారు. మరో మూడు బ్యాచ్‌లకు ప్రత్యేక శిక్షణ ఇప్పించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమాలన్నీ పర్యాటక శాఖ, నిథమ్ డైరెక్టర్ జెడ్ హనుమంతు పర్యవేక్షణలో సాగుతున్నాయన్నారు.

మంద కృష్ణ మాదిగ నేతృత్వంలోనే న్యాయం

గోల్కొండ: ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్‌మాదిగ అన్నారు. మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు వరించడంతో కార్వాన్‌లోని ప్రభుత్వ హాస్టల్‌లో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలకు పైగా మందకృష్ణ మాదిగ చేసిన అలుపెరగని పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ కల సాకారమవుతుందన్నారు. ఫిబ్రవరి 7న నిర్వహించనున్న 'లక్ష డప్పులు-వేయిగొంతులు' కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. డాక్టర్ పి.సుధాకర్‌మాదిగ మాట్లాడుతూ... మందకృష్ణ చేసిన పోరాటానికే కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ఇచ్చిందని పేర్కొన్నారు.

ప్రారంభోత్సవాలకు మంత్రికి ఆహ్వానం



మంత్రి శ్రీధర్‌బాబును ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: నియోజకవర్గ పరిధిలోని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలు, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే పూర్తి అయిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, చేపట్టాల్సిన పనులకు శంకుస్థాపనలు చేసేందుకు హాజరు కావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, జిల్లా ఇంచార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబును రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆహ్వానించారు. ఫిబ్రవరి 6వ తేదీన ఆయా కార్యక్రమాలకు హాజరు కావాలని కోరామన్నారు. ఇందుకు మంత్రి అంగీకరించారని ఎమ్మెల్యే వివరించారు. బుధవారం ఆయనను కలిసి ఈ మేరకు మూడు మున్సిపాలిటీల పరిధిలో చేయాల్సిన పనుల వివరాలను తెలియజేశారు.

యుక్త వయసు నిర్ణయాలపైనే భవిష్యత్



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ డాక్టర్ ఎంఏ కరీం

ఏజీవర్సిటీ: యువత తలుచుకుంటే సాధించనిది ఏదీ ఉండదని... యుక్త వయసులో తీసుకునే నిర్ణయాలు కీలకంగా వారి భవిష్యత్‌ను నిర్దేశిస్తాయని తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఎ.కరీం అన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని సీటీఐ కాన్ఫరెన్స్ హాల్‌లో యువజన క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంను నిర్వహించారు. ప్రధాన శిక్షకుడిగా పాల్గొన్న ఆయన యువతకు మానసిక శక్తి సామర్థ్యాలపై శిక్షణ ఇచ్చారు. జీవితంలో అత్యంత కీలకమైనది యవ్వన దశ అని ఈ దశలో తీసుకున్న నిర్ణయాల ఆధారంగానే భవిత్యం ఆధారపడి ఉంటుందని ఈ సందర్భంగా కరీం పేర్కొన్నారు. లక్ష్యం లేని జీవితం వృథా అవుతుందని స్పష్టం చేశారు. యువత వ్యసనాలకు బానిసగా మారి మానవీయ, సామాజిక సంబంధాలకు దూరం అవుతోందన్నారు. మద్యం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. స్మార్ట్ ఫోన్‌లో అధిక సమయం గడిపే వారు మానసిక రుగ్మతల బారిన పడున్నారని అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్, నల్లగొండ అధికారులతోపాటు ఛత్తీస్‌ఘడ్ నుంచి యువతీయువకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనపై పెరుగుతున్న వ్యతిరేకత



చేవెళ్లకు తరలివెళ్తున్న బీజేపీ నాయకులు

బండ్లగూడ: చేవెళ్ల పట్టణంలో బీజేపీ చేపట్టిన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్ నిరుడు శేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు బుధవారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కిస్మత్‌పూర్ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా చేవెళ్లకు బయలుదేరారు. ఈ సందర్భంగా శేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ... ప్రస్తుతం కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా పెరిగిపోయిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ వైపు ప్రజలు చూస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం బీజేపీతోనే సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, లక్ష్మణ్, నరేష్, బాలరాజ్, ప్రేమ్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

బహుభాషలు నేర్చుకోవడం అవసరం



మాట్లాడుతున్న వీసీ సయ్యద్ ఐనుల్‌హసన్

రాయదుర్గం: బహుభాషలు నేర్చుకోవడం అవసరమని మనూ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'భారతదేశంలో ఆంగ్లభాష చరిత్ర.. పరస్పర చర్యలు' అనే అంశంపై మూడవ హిస్టరీ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఎడ్యుకేషన్ (హెచ్ఈఎల్ఈ) మూడవ సదస్సును బుధవారం ప్రారంభించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ ప్రపంచ దృక్పథాన్ని అవలంబించడం చాలా అవసరమన్నారు. ఇంగ్లిష్ ప్రొఫెసర్ వివిఎన్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సమకాలీన బోధనా శాస్త్రంలోని సవాళ్లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం 24 మంది పరిశోధక విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు పత్రసమర్పణ చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సల్మాహ్మద్ ఫారూఖీ, ఇంతియాజ్ హస్నైన్, రాహత్ ఫిరోజ్, సమీనా తబస్సుమ్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో 'యాంటీ డ్రగ్' విధానం అమలు



కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌సీయూ డీఎస్‌డబ్ల్యూ, సైబర్‌క్రైమ్స్ టీమ్స్, టీజీసీహెచ్ఈ అధికారులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'యాంటీ డ్రగ్స్' విధానం అమలులోనే ఉందని హెచ్‌సీయూ స్టూడెంట్స్ వెల్ఫేర్ డిప్యూటీ డీన్ ప్రొఫెసర్ ఎస్.రుక్మారేఖ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో తెలంగాణ సైబర్ క్రైమ్ టీమ్, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, హెచ్‌సీయూ డీఎస్‌డబ్ల్యూ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సీఐఎస్ ఆడిటోరియంలో 'సైబర్ క్రైమ్స్‌పై ప్రత్యేక అవగాహన' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రుక్మారేఖ మాట్లాడుతూ క్యాంపస్‌ను డ్రగ్స్ ఫ్రీ క్యాంపస్‌గా మార్చడంలో అందరినీ భాగస్వాములను చేశామన్నారు. అందరూ సంపూర్ణంగా సహకరించడంతో ఇది సాధ్యమయిందన్నారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఆశిష్‌రెడ్డి మాట్లాడుతూ సైబర్ భద్రతా పద్ధతులను అందరూ అనుసరించడం చాలా ముఖ్యమన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రశ్నోత్తరాల కార్యక్రమం నిర్వహించి విద్యార్థులు అపోహలకు సమాధానాలను సైబర్‌క్రైమ్ విభాగం అధికారులు వివరించారు. కార్యక్రమంలో టీజీసీహెచ్ఈ కన్సల్టెంట్ అన్నపూర్ణ గాదెపల్లి, దిల్‌సే వలంటీర్లు సునీల్ సోమనగుర్తి, సాయినాథ్‌చారి, హెచ్‌సీయూ విద్యార్థులు, డీఎస్‌డబ్ల్యూ విభాగ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



కాళీమందిర్ చౌరస్తాలో పొగ మంచు



బండ్లగూడ రహదారిపై కమ్మేసిన పొగ మంచు

మంచు కురిసే వేళలో...

- బండ్లగూడ జాగీర్ పరిధిలో కమ్మేసిన పొగ మంచు
- ఉదయం 8 గంటలు దాటినా వీడని మంచు తెరలు
- లైట్లు.. ఇండికేటర్లు వేసుకొని వెళ్లిన వాహనదారులు



హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిలోని పోలీస్ అకాడమీ సమీపంలో...

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దట్టమైన పొగ మంచు కమ్మేసింది. గడచిన వారం రోజులుగా ఉదయం 8 దాటినా వాహనాదారులు రోడ్లపైకి రావాలంటే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై పొగ మంచు కారణంగా వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగాయి. ఎదురుగా 10 అడుగల దూరంలో ఉన్న వాహనం కూడా కనిపించనంతగా పొగ మంచు కమ్మేసింది. దీంతో వాహనదారులు లైట్లు, ఇండికేటర్లు వేసుకొని మరీ రాకపోకలు సాగించారు. వేకువజామున నుంచే ఉన్న పొగ మంచు క్రమేపీ పెరగడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనదారులు ఇలాంటి సమయాల్లో ప్రధానంగా చౌరస్తాలలో ప్రయాణించేటప్పుడు పటిష్ఠ జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.